క్లుప్తంగా

నేడు ఆర్‌బీఎస్ రవీంద్ర దర్పణ్

గోల్కొండ: రవీంద్రభారతి పాఠశాలల వార్షికోత్సవం రవీంద్ర దర్పణ్ 2022–23 నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం డీన్ జోన్ ప్రియామనీష, డీఐ మధు తెలిపారు. పబ్లిక్‌గార్డెన్‌లోని లలితకళాతోరణంలో నేడు సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు చెందిన జస్టిస్ పుల్ల కార్తీక్, విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు.

విద్యావేత్త జితేందర్‌సింగ్‌కు ఆచార్యదేవోభవ అవార్డు



జితేందర్‌సింగ్‌కు అవార్డును అందజేస్తున్న కేవీ.బ్రహ్మం

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా ట్రస్మా ఆసిఫ్‌నగర్ మండలం ప్రధాన కార్యదర్శి, విద్యావేత్త జితేందర్‌సింగ్‌కు ఆచార్యదేవోభవ, 2022–23 అవార్డును బహూకరించి సన్మానించారు. విద్యారంగంలో విద్యార్థులకు ఉత్తమంగా తీర్చి దిద్దడం సామాజిక బాధ్యతగా విద్యారంగాన్ని వ్యాప్తి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును బ్రెయిన్‌ఫీడ్ చీఫ్ ఎడిటర్ కేవీ.బ్రహ్మం అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్ సింగ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా ఉండి నిరంతరం విద్యారంగ వ్యాప్తికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎస్ఎన్ శశాంక్‌కు అవార్డు ప్రదానం



సుల్తాన్‌బజార్: వంశీ ఆర్ట్ థియేటర్స్–లిటిల్ మ్యూజిషియన్ అకాడమీ, శుభోదయం గ్రూప్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో విద్వాన్ కమలకిరణ్ వింజమూరి శిష్యులు ఎస్ఎన్.శశాంక్ (వాషింగ్టన్) కర్ణాటక సంగీత గాత్ర కచేరి అలరించింది. ఈ సందర్భంగా శశాంక్‌కు వంశీ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీరామరాజు చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎన్.శశాంక్‌చే నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, లిటిల్ మ్యూజిషియన్ అకాడమి వ్యవస్థాపకులు రామాచారి, తెన్నేటి సుధారాణి, సుంకరపల్లి శైలజ, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

నుమాయిష్‌లో విజయడైరీ స్టాల్ ప్రారంభం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర రైతుల సంతోషమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో విజయడైరీ స్టాల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతాంగానికి కావాల్సిన అన్ని సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు విజయడైరీని మూసివేసే పరిస్థితి ఉండేదని, కానీ నేడు రూ.700 కోట్ల టర్నోవర్ సాధించినట్లు వెల్లడించారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులను అందిస్తున్నామని అందువల్లనే మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌లెట్లను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి ఆదార్ సిన్హా, రాష్ట్ర డైరీ అభివృద్ధి సంస్థ చైర్మన్ భరత్‌కుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్వినిమార్గం పాల్గొన్నారు.

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం 14వ రోజుకు చేరింది. కార్మికులు 13వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పనులను కార్పొరేటర్ మాలతీ నాగరాజు పరిశీలించారు. వెస్టెండ్ కాలనీ, చంద్రయ్య కాలనీ, హిమగిరినగర్ కాలనీ రోడ్ నెంబర్ 1,2, సాయిబాలాజీ నగర్, ఇండస్ వ్యాలీ, పార్కు, మెయిన్ రోడ్డు, విజయ మెడికల్ షాపు నుంచి చంద్రయ్య కాలనీ, యాదయ్యనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ పాల్గొన్నారు.

సాంకేతిక వైద్య పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

డీఎంఈ డాక్టర్ రమేష్



సదస్సులో ప్రసంగిస్తున్న డీఎంఈ డాక్టర్ రమేష్

సుల్తాన్‌బజార్: వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక వైద్య పరిజ్ఞానాన్ని యువ వైద్యులు అందిపుచ్చుకోవాలని తెలంగాణ వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేష్ రెడ్డి సూచించారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలోని న్యూ అకాడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన హోమ్–2023 హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 21వ సదస్సును డీఎంఈ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థోపెడిక్ విభాగంలో అత్యాధునిక వైద్య పరిజ్ఞానం వైద్య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇలాంటి సదస్సులు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఏడాది యువ వైద్యులలో, ఆర్థోపెడిక్ రంగంలో నూతనోత్తేజాన్ని నింపేందుకు ఉస్మానియా ఆర్థోపెడిక్ విభాగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులు 350కి పైగా పాల్గొన్న ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ సదస్సులో పీజీ ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులకు క్లీనికల్ ఎగ్జామినేషన్, ఇన్వెస్టిగేషన్, మేనేజ్‌మెంట్ రిహాబిలిటేషన్ వాటిపై క్లాసులు ఉంటాయన్నాయన్నారు. అనంతరం సీనియర్ వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, ఉస్మానియా ఆసుపత్రి ఆర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ రమేష్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ తిమ్మారెడ్డి, జీవీఎస్.మూర్తి, శేఖర్, అగ్నేష్, సుధీర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఎస్ఎస్ రావుతో పాటు పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



పనులను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: రాష్ట్రాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ డివిజన్‌లో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సైతం ఎన్నో నిధులు కేటాయించిందన్నారు. తానూ ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు నియోజకవర్గానికే కాకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు గాను నిధులు కేటాయిస్తున్నానన్నారు. అందులో భాగంగానే నాంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యం ఇస్తూ అవసరాల దృష్ట్యా వివిధ పనులకు గాను నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నానన్నారు. అయితే కేంద్రం ఇచ్చే నిధుల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా ప్రస్తావించకుండా రాష్ట్ర ప్రభుత్వ నిధులంటూ ప్రచారం చేసుకుంటుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణకు వేలకోట్ల రూపాయాలు కేటాయించడం జరిగిందని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ కరుణాకర్, నాంపల్లి నియోజకవర్గ ప్రభారి పద్మారెడ్డి, పాలక్ అశ్వత్థామారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, బల్దియా డీఎంసీ అలీ, జలమండలి జీఎం వినోద్ భార్గవ్, బల్దియా ఈఈ లాల్‌సింగ్ ఉన్నారు.

జీఎస్టీ నంబర్–1 కావడానికి ఉద్యోగుల పాత్ర కీలకం



కమిషనర్ నీతుకుమారి ప్రసాద్‌ను సన్మానిస్తున్న మహ్మద్ ముజాహీద్ హుస్సేన్

అబిడ్స్: జీఎస్టీలో దేశంలోనే రాష్ట్రం నంబర్–1 కావడానికి వాణిజ్య పన్నుల ఉద్యోగుల పాత్ర కీలకంగా మారిందని, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతుకుమారి ప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నూతన 2023 కేలండర్‌ను, టేబుల్ కేలండర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి ఉద్యోగుల భద్రత కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగులు ఎంతో కీలకంగా మారారన్నారు. నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహీద్ హుస్సేన్, ఇతర నాయకులు జలాలుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్‌రావు, సునీల్‌కుమార్, సోమేష్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్, భిక్షపతి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ



చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న బీకాం విద్యార్థిని ఐశ్వర్య జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. వారణాసిలో జరిగిన 7వ ఆలిండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కటాలో సిల్వర్ మెడల్, కుమిలో బంగారు మెడల్‌ను సాధించింది. ఈ మేరకు విద్యార్థినిని ఆమె విద్యనభ్యసిస్తున్న కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సోమేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, నాయక్ బూడోఖాన్ కరాటే మాస్టర్ గణేష్ నాయక్‌లు అభినందనలు తెలియజేశారు.

నేడు ఎస్‌బీఏ గార్డెన్‌లో జేపీ నడ్డాతో ‘ఫోన్‌ఇన్’



మాట్లాడుతున్న అశోక్ గౌడ్, అమర్‌సింగ్ తదితరులు

జియాగూడ: వర్చువల్ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇచ్చే సందేశాన్ని గడపడగపకూ తీసుకెళ్లాలని కార్వాన్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి, ఇబ్రహీంపట్నం బీజేపీ ఇన్‌చార్జ్ కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడలోని ఎస్‌బీఏ గార్డెన్‌లో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, కన్వీనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన విలేకర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌కు రానున్న జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముందుగా సరల్ ఆఫ్‌ను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. అనంతరం ప్రతి నియోజకవర్గం నుంచి 20 మంది బీజేపీ కార్యకర్తలతో ఫోన్ ద్వారా సంభాషిస్తారన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆయన స్పష్టం చేశారు. శనివారం చేపట్టే వర్చువల్ మీటింగ్ ఎస్‌బీఏ గార్డెన్ భవనంలో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని ప్రతి డివిజన్ నుంచి బీజేపీ సీనియర్ నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభారీగా ప్రహల్లాద్‌రావు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ డేగాన్, ఉపాధ్యక్షురాలు రాధిక, మాజీ కార్పొరేటర్ మునిందర్, శివరత్నం, శకుంతల పాల్గొన్నారు.

నాంపల్లిలో పెరిగిన ఓటర్లు

నాంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో నాంపల్లి నియోజకవర్గంలో మొత్తం 3,09,321 ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 277 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 160272 పురుష ఓటర్లు, 149040 మహిళా ఓటర్లు, తొమ్మిది మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 11, 232 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. కొత్తగా 29,968 మంది ఓటర్లు కొత్తగా చేరారు. ప్రస్తుతం ఏఐఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ జాఫర్ హుస్సేన్ మెరాజ్ హుస్సేన్ ఇప్పటి వరకు రెండు పర్యాయాలు గెలుపొందారు. 2002 నియోజకవర్గాల పునర్విభజన చట్టం ప్రకారం 2009 ఎన్నికలకు ముందు నాంపల్లి, ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుంచి వేరు చేయబడింది. ప్రస్తుతం ఈ అసెంబ్లీ నియోజకవర్గం రెడ్‌హిల్స్, మల్లేపల్లి, విజయనగర్ కాలనీ, మురాద్‌నగర్, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, అహ్మద్‌నగర్ అనే మున్సిపల్ డివిజన్లు ఉన్నాయి.

మాతా శిశు సంరక్షణకు నిలోఫర్‌లో మెరుగైన సేవలు

నాంపల్లి: మాతా శిశు సంరక్షణకు నిలోఫర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. ఈ నెల 4న ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన ‘భయపెడుతున్న నిమోనియా’ అనే కథనానికి స్పందించి వెంటనే ఆమె వివరణ ఇచ్చారు. ఈ విషయమై ముగ్గురు సభ్యులతో కూడిన ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. రోగులకు, రోగి సహాయకులు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సరిపడా ఉన్నారని, 763 ఆక్సిజన్ పాయింట్స్, 100కు పైగా చక్రాల కుర్చీలు, స్ట్రెచర్స్ అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈనెల 2, 3వ తేదీల్లో ఆరుగురు చిన్నారులు విభిన్న కారణాలతో చనిపోయిన విషయం వాస్తవమే అన్నారు. ఈ కేసులన్నీ పరిస్థితి చేయి దాటిన తదుపరి నిలోఫర్ ఆసుపత్రిలో చేరినవేనని చెప్పారు. శీతాకాల ప్రభావంతో నిలోఫర్ ఆసుపత్రిలో ఔట్ పేషంట్ల సంఖ్య, ఇన్‌పేషంట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వివరించారు. ఆసుపత్రిలో సరిపడా అంబులెన్స్‌లు, డ్రైవర్లు అందుబాటులో ఉన్నారని, కావాల్సినన్ని వెంటిలేటర్స్, వార్మర్స్ పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. చక్రాల కుర్చీలో కూర్చున్న ఇద్దరు పిల్లలు అక్కా చెల్లెల్లు, వీరిద్దరు ఆసుపత్రిలో అనారోగ్యంతో చేరారని, వారి తల్లి కోరిక మేరకు ఒకే చక్రాల కుర్చీలో కూర్చోబెట్టినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తలాబ్‌చంచలం కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం అన్నారు. డివిజన్ పరిధిలోని భవానీనగర్, చాచా గ్యారేజ్, సలేంచౌక్ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా బస్తీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ప్రజలతో ఆరా తీస్తున్నామన్నారు. భవానీనగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డును తొలగించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఆమెతో పాటు పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి



యార్లగడ్డ వెంకటరమణను సన్మానిస్తున్న ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు అండగా నిలవాలని అటల్ బీహారి వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్మన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో అఖిలభారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అండగా నిలుస్తున్న పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ, తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం నాయకుల పర్యటన

రాజేంద్రనగర్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జీ మిర్జా రహమత్‌బేగ్ అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ నవాజుద్దీన్, జలమండలి అధికారులతో కలిసి మహమూద్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం మిర్జా రహమత్‌బేగ్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి జనరల్ మేనేజర్ కృష్ణకు సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ జహంగీర్, సయ్యద్ జావీద్, మతాముద్దీన్, ముజాద్ తదితరులున్నారు.



మహమూద్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న మిర్జా రహమత్‌బేగ్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కమేలా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. ఏజీ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే రమా టాకీస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. హైదర్‌గూడ పరిధిలోని మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఖాజాపురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ముర్తుజానగర్, మౌలాకా చిల్లా ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. అబిద్ అలీ ఆస్పత్రి పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఆగాపురా విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఆగాపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆగాపురా నాలా, టెలిఫోన్ ఎక్స్చేంజ్, హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ జించిచౌరా విద్యుత్ ఫీడర్ పరిధిలోని బోయిగూడ కమాన్, ప్రకాష్ టాకీస్, రాణా ప్రతాప్ కమ్యూనిటీ హాల్, రాకెట్ గ్రౌండ్, ఎస్‌బీఐ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి నిరుపేదలకు రేషన్

నాంపల్లి: జాతీయ ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులకు కేంద్రం మరో ఏడాది పాటు ఉచితంగా ఐదు కేజీల బియ్యాన్ని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా గత డిసెంబరు నెల వరకు ఐదేసి కేజీల చొప్పున అదనంగా బియ్యం ఇచ్చేది. కానీ ఈ ఏడాది జనవరి కోటాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచిత బియ్యం కోటాపై ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు కేంద్రం అందజేసే ఐదు కేజీల బియ్యాన్ని మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 7 నుంచి జాతీయ ఆహార భద్రతా కార్డుదారులకు కార్డులో పేరు ఉన్న ఒక్కొక్కరికీ ఐదు కేజీల బియ్యం మాత్రమే అందుతాయి. రేషన్ దుకాణాల్లో ప్రతినెలా 5 నుంచి 20వ తేదీ వరకు సరుకులు అందేవి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జనవరి నెల కోటా బియ్యం సరఫరాలో రెండు రోజులు ఆలస్యమైంది. లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గోదాముల నుంచి బియ్యం ఇప్పటికే ఆయా రేషన్ దుకాణాలకు సరఫరా జరిగింది. నేటి నుంచి జాతీయ ఆహార భద్రతా కార్డుదారులకు 5 కేజీలు, అంత్యోదయ కార్డుదారులకు 35 కేజీలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కేజీల బియ్యం చొప్పున అందుతాయి. మెహిదీపట్నం సర్కిల్–5 పరిధిలోని అన్ని రేషన్ దుకాణాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయి.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



స్థానికులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలీచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో పర్యటించి ఆయా ప్రాంతాల వారిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీలు అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాలను సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయిస్తున్నానన్నారు. నానల్‌నగర్, టోలీచౌకి, గోల్కొండ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో ఎన్నో కాలనీలు ముంపునకు గురవుతూ వస్తున్నాయన్నారు. ఈ కాలనీలకు ముంపు ప్రమాదం లేకుండా భారీ పైప్‌లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. నదీం కాలనీలో ఈపాటికే డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తయ్యాయని, ఇక ఆ కాలనీకి ముంపు ప్రమాదం ఉండదన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.293 కోట్లతో కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు.

సమైఖ్యతకు ప్రతీక కళలు

గన్‌ఫౌండ్రీ: దేశ సమైఖ్యతకు శాస్త్రీయ కళలు ప్రతీకలని తెలంగాణ రాష్ట్ర నీటు పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేణుగోపాల చారి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో కళావిపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాగ్యనగర్ నాట్యాలయ పేరిట విభిన్న సాంప్రదాయ నృత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాలకు చెందిన కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులకు సముచిత ప్రాధాన్యతను కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కథక్, ఒడిసి, బెంగాలీల నృత్యాలతో పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు వెంకటకృష్ణ నిర్వహణలో పౌరాణిక నాటక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి గోపీనాథ్‌రెడ్డి, నాట్య గురువు పసుమర్తి శేషుబాబు, నిర్వాహకులు కరుణారెడ్డి, డాక్టర్ అనురాధ, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న పలువురు ప్రముఖులు

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి



విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బహదూర్‌పురా: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ది గోల్డెన్ జూబ్లీ హైస్కూల్ డైరెక్టర్ హైదర్ రజా అన్నారు. హెల్మెట్ ప్రాముఖ్యత, వాడకంపై శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో 70శాతం మరణాలు తలకు దెబ్బలు తగలడంతో సంభవిస్తున్నాయన్నారు. తలకు దెబ్బ తగలకుండా ఉండాలంటే నాణ్యమైన హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం ట్రాక్స్ రోడ్డు సేఫ్టీ ఎస్‌జీఓ సహకారంతో సుమారు 100 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు పంపిణీ చేసి బస్తీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాక్స్ రోడ్డు సేఫ్టీ సంస్థ ప్రతినిధులు రాధికా జైన్, రాజీవ్ నీమ్కర్, ఎం.ఎ.ఐడియల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

సుల్తాన్‌బజార్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వేనంబర్ 613/14లో రెండెకరాల స్థలాన్ని ఓ పార్టీకి చెందిన నేత రిజిస్ట్రేషన్ చేయిస్తానని తమ వద్ద లక్షల రూపాయాలు వసూలు చేసి మోసం చేశాడని ఆయనపై, ఆయనకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సామాజిక కార్యకర్త జయంతితో కలిసి బాధితులు మాట్లాడారు. 2007లో జవహర్‌నగర్‌లో ఇంటి స్థలాలు కొనుగోలు చేశామన్నారు. అప్పటి ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి షెడ్లు వేసుకోమని చెప్పారన్నారు. వేసిన షెడ్లను అధికారులు కూల్చివేశారన్నారు. ఈ విషయమై ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డికి విన్నవించామని తెలిపారు. ఆయన మీ స్థలాలు ఎక్కడ వెళ్లవని హామీ ఇచ్చి ఇప్పుడు కూరగాయల మార్కెట్ నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఓ పార్టీ నాయకుడు కల్పించుకుని ఈ నోటరీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ రూ.13 లక్షలు తీసుకుని మూడేళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

అవినీతి లేని దేశమే లక్ష్యం

పంజగుట్ట: అవినీతి లేని దేశంను చూడాలన్నదే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ లక్ష్యమని కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ కమిటీ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.ఆంజనేయులు, ప్రధానకార్యదర్శిగా నామా సైదులు, కార్యదర్శిగా జైన శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గత 15 ఏళ్లుగా కమిటీ పని చేస్తోందన్నారు. ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకువచ్చి, వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.